చెరువులను తలపిస్తున్న రోడ్లు

మరమ్మతులు చేపట్టాలని ప్రజల వేడుకోలు

భీమడోలు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. రహదారులపై ఏర్పడిన భారీ గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఏర్పడిన భారీ గోతులను కనీసం పూడ్చించాలని వారు కోరుతున్నారు. వర్షపు నీటితో రోడ్డు గోతులు నిండిన ఉండడంతో ఏది గొయ్యో తెలియక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే లోతట్టులో ఉన్న రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోతుంది. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు, భీమడోలు రాజుల వీధి రోడ్డు, గుండుగొలను నుంచి భోగాపురం రోడ్డులు అధ్వానంగా మారాయి. గుండుగొలనులోని బీసీ కాలనీలో పల్లపు రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని పల్లపు ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం వస్తే రోడ్లు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. ఇరు వైపులా డ్రెయిన్లు లేకపోవడంతో రోడ్లపై నిలిచిన నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని, అపారిశుధ్య పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రజలు వాపోతున్నారు. ఎప్పుడు అనారోగ్యం బారిన పడతామోనని ఆందోళన చెందుతున్నారు. భీమడోలు గ్రామానికి చెందిన ప్రధాన రహదారుల మీదుగా ప్రతి రోజూ వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో పాటు ద్వారకాతిరుమల వెళ్లే భక్తులంతా ఈ రోడ్లపైనే వెళ్లాల్సి ఉంది. రాత్రి వేళల్లో ఈ రోడ్ల వెంబడి వీధి లైట్లు లేకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులవుతున్నారు. వాహనాలు మొరాయించడంతో నానా అవస్థలు పడుతున్నారు. గుండుగొలను నుంచి భోగాపురం వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఏఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్ ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వినతిపత్రం కూడా అందజేశారు. గత ప్రభుత్వం అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి. ఇకనైనా సంబంధిత అధికారులు రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు రోడ్డు దుస్థితి


భీమడోలు రాజుల వీధిలో రోడ్డు గోతుల్లో నిలిచిన వర్షపు నీరు


గుండుగొలను బీసీ కాలనీలో రోడ్లపై ప్రవహిస్తున్న నీరు

క్లుప్తంగా

డైరీలు, నోటు పుస్తకాల పంపిణీ


నోట్ పుస్తకాలు, డైరీలు పంపిణీ చేస్తున్న దాత నాగవెంకట కృష్ణ

గణపవరం: జల్లికొమ్మర యూపీ స్కూల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గణపవరం వాణీ ఫ్యాన్సీ నిర్వాహకులు వంకాయల నాగవెంకట కృష్ణ ఆర్థిక సాయంతో 150 మంది విద్యార్థులకు వార్షిక డైరీలు, నోట్ పుస్తకాలు పంపిణీచేశారు. హెచ్ఎం సుందరకుమార్ మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్లో మాదిరిగా ప్రభుత్వ బడుల్లో వార్షిక డైరీలు ఉచితంగా పంపిణీ చేసిన దాతను అభినందించారు. వీటి విలువ రూ.6వేల వరకు ఉంటుందన్నారు. కార్య క్రమంలో పేరెంట్ కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు సీహెచ్ లీలాగోపాల్, పి.సౌజన్య, బి.శ్రీదేవి, జి.పార్వతి, సరస్వతి, రమేష్‌లు ఉన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న కార్యదర్శి


చెరువు గట్టు స్థలంలో స్తంభాలు పాతుతున్న దృశ్యం

ఉంగుటూరు: కైకరం గ్రామంలో పంచాయతీకి చెందిన రంగమ్మ చెరువును ఆనుకుని అధికార పక్షానికి చెందిన వ్యక్తి ఒకరు స్తంభాలు పాతి నిర్మాణ సామగ్రిని సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్ ఆ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీంతో సదరు వ్యక్తి అనుమతులు తెచ్చుకునే నిర్మాణం చేపడతామని అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు చెబుతున్నారు. గ్రామ మధ్యలో పంచాయతీ భూమిలో ఆక్రమణలకు పూనుకోవడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్‌ను ప్రశ్నించగా ఆక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నట్టు చెప్పారు.

ఎస్సీ కాలనీలోని వర్షపు నీరు మళ్లింపు


ముంపునీటిని బయటకు తరలిస్తున్న దృశ్యం

గణపవరం: గణపవరం మండలం జల్లికాకినాడ గ్రామంలోని ఎస్సీ కాలనీకి ముంపు ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలనీని ఆనుకుని చేపలు, రొయ్యల చెరువులు తవ్వడం, చెరువు గట్లు ఎత్తుగా వేయడంతో వర్షాలు కురిస్తే వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక ముంపు సమస్య తలెత్తుతుంది. దీంతో మంగళవారం గ్రామ పంచాయతీవారు పొక్లెయినర్‌తో వర్షపునీటిని పశువుల చెరువులోకి మళ్లించారు. కాలనీ పక్క నుంచి ఒక కాలువ ఏర్పాటుచేసి ముంపునీరు పశువుల చెరువులోకి వెళ్లేలా ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు ఊపిరిపీల్చుకున్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలు


కాగుపాడు పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఉంగుటూరు: డెంగీ నివారణపై మాసోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. మలేరియా అధికారి లక్ష్మణరావు కాగుపాడు, చేబ్రోలు పీహెచ్‌సీల్లో సమావేశాలు నిర్వహించి వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీలు నిర్వహించారు. ఈనెల 31 వతేదీ వరకు మాసోత్సవాలు గ్రామాల్లో నిర్వహించాలని లక్ష్మణరావు సూచించారు. లార్వా దశలోనే డెంగీ దోమను ఎలా నివారించాలో లక్ష్మణరావు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కామవరపు శ్రీనివాసరావు,సామాజిక ఆరోగ్య అధికారి రత్న రాజ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు వీవీ నాగలక్ష్మి, గంగాధరరావు, సత్యనారాయణ, పీహెచ్ఎన్ విశ్వాస కుమారి, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మ కోసం మొక్క నాటాలి

దెందులూరు: ప్రధాని మోదీ అమ్మ కోసం ఒక మొక్క నాటాలన్న పిలుపును ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని బీజేపీ దెందులూరు మండల అధ్యక్షుడు బుజ్జి గోపాల్ అన్నారు. మంగళవారం గాలాయగూడెంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు స్వగ్రామాలు, పరిసర ప్రాంతాలు, పచ్చదనం కాపాడేందుకు ముందుచూపుతో భారత ప్రధాని ఇచ్చిన పిలుపును ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. ఈ నెల 6వ తేదీ వరకు ప్రతి వ్యక్తి మొక్కను ఇంటి వద్ద నాటి, సంరక్షణ బాధ్యతను చేపట్టాలని ఆయన సూచించారు.

కాలువలో తూడు తొలగించండి


కృష్ణా కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

దెందులూరు: కృష్ణా, గోదావరి కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించాలని ఆయకట్టు రైతులు అధికారులను కోరుతున్నారు. సార్వా సాగు పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్న తరుణంలో గోదావరి, కృష్ణా కాలువల నీరు ఆయకట్టు దిగువన పూర్తిస్థాయిలో పారేందుకు గుర్రపుడెక్క అటంకంగా మారింది. నీటి పారుదలకు ఆటంకంగా ఉన్న గుర్రపుడెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఏలూరు రోటరీ క్లబ్‌కు అవార్డులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు రోటరీ క్లబ్ 2023–24 సంవత్సరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు అవార్డుల పంట పండింది. విజయవాడలో జరిగిన రోటరీ అవార్డ్స్ నైట్ కార్యక్రమంలో ఈ క్లబ్ 17 అవార్డులు కైవశం చేసుకుందని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.దామోదర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు అధ్యక్షుడు రోహిత్‌కు బెస్ట్ ప్లాటినం అవార్డు లభించిందని పేర్కొన్నారు. ఈ క్లబ్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని వివరించారు. క్లబ్ అధ్యక్షుడిగా రోహిత్ పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో స్వామి త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరుకు 2023–24 సంవత్సరపు పదవీ కాలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి, అందరి మన్ననలు పొందిన క్లబ్ అధ్యక్షుడు రోహిత్, జాయింట్ సెక్రటరీ వెజ్జు నాగమణి ప్రియలను ప్రత్యేకంగా అభినందించారు.

వ్యాధుల నివారణలో 'ఆశ'ల పాత్ర కీలకం


పిప్పరలో డెంగీపై ప్రదర్శన చేస్తున్న ఆశవర్కర్లు, వైద్యసిబ్బంది

గణపవరం: అంటువ్యాధుల నివారణ, ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించడంలో ఆశవర్కర్లు ప్రధాన బాధ్యత తీసుకొని చిత్తశుద్ధితో పనిచేయాలని గణపవరం, పిప్పర పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.కిరణ్మయి, కె.ప్రియాంక అన్నారు. మంగళవారం గణపవరం, పిప్పర పీహెచ్‌సీల్లో ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డెంగీ మాసోత్సవాల సందర్భంగా గ్రామాల్లో డెంగీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. దోమ కాటు వల్లే డెంగీ సోకుతుందని, దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా ప్రజలు రక్షణ చర్యలు తీసుకోవాలని, ఇళ్ల సమీపంలో దోమలు వృద్ధి చెందే మురుగునీటి కుంటలు, చెత్తాచెదారం, కొబ్బరి డొక్కలు, పాతసామాన్లు వంటివి ఇళ్ల సమీపంలో లేకుండా చూసుకోవాలని సూచించారు. తద్వారా డెంగీవ్యాధికి దూరంగా ఉండవచ్చునని అన్నారు. ఆశ వర్కర్లతో కలిసి వైద్యసిబ్బంది గణపవరం, పిప్పర గ్రామాల్లోని ప్రధాన వీధులలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు జాలాది విల్సన్, వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకులు నామాలరాజు, యోహాన్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

4న విద్యా సంస్థల బంద్


విద్యార్థి సంఘాల ఐక్యతను చాటుతున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జూలై 4న తలపెట్టే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం అనీల్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ నిర్వహించిన నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 4న విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చినట్టు చెప్పారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు అయోమయ పరిస్థితిలోకి వెళ్లిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పరీక్ష ప్రారంభించినప్పటి నుంచి అనేక అవకతవకలకు పాల్పడుతూనే ఉందని, ఇప్పుడు కూడా నీట్ పరీక్ష పేపర్ దాదాపుగా 30 లక్షలకు అమ్మేశానని ఒక వ్యక్తి అంటుంటే, మరి కొందరు కొనుగోలు చేశామని వాగ్మూలం ఇచ్చారని వివరించారు. అయినా ప్రధాని లేదా కేంద్ర విద్యా శాఖ మంత్రి లేదా ఎన్‌టీఏ లేదా పరీక్ష పేపర్ లీక్ చేసిన వ్యక్తులపైనా చర్యలు తీసుకోకుండా విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించే విద్యాసంస్థల బంద్‌లో ప్రైవేటు, కార్పొరేట్, ప్రభుత్వ అన్ని రకాల విద్యా సంస్థలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గరికె అఖిల్, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై ఉద్దేశపూర్వకంగానే దాడి


ఆటో డ్రైవర్ రమేష్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కొవ్వలి గ్రామానికి చెందిన మాత్రపు రమేష్‌పై కొందరు ఆటో డ్రైవర్లు దాడి చేయడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండించింది. ఆటో యూనియన్ కొవ్వలి ప్రెసిడెంట్‌గా ఉన్న రమేష్‌పై సీరియల్ విషయంలో ఉద్దేశపూర్వకంగా వివాదాన్ని సృష్టించి, ఏలూరు టౌన్ ఆటో యూనియన్ ప్రోద్బలంతో దాడి చేశారని నాయకులు ఆరోపించారు. రమేష్‌పై దాదాపు 30 మంది డ్రైవర్లు దాడి చేశారని, తలకి గాయం కావడంతో ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గాయానికి రెండు కుట్లు వేశారని తెలిపారు. రమేష్‌ను పరామర్శించేందుకు వెళ్లిన ఏలూరు జిల్లా ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపిని టౌన్ యూనియన్‌కు చెందిన నగరబోయిన లీలా కృష్ణ తన అనుచరులతో దుర్భాషలాడుతూ దాడికి దిగినట్టు చెప్పారు. రమేష్, గోపిలపై దాడి చేసిన లీలా కృష్ణ, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. రమేష్‌ను డీఎన్‌వీడీతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, ఏలూరు నగర నాయకులు పి.కిషోర్, వి.సాయి బాబు, ఆటో యూనియన్ నాయకులు చక్రాల అమర్ కుమార్ పరామర్శించారు.

నిబంధనలు పాటించడం తప్పనిసరి


జంగారెడ్డిగూడెంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రాజేష్, ట్రాఫిక్, పోలీసు సిబ్బంది

జంగారెడ్డిగూడెం: నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని సీఐ పి.రాజేష్ వాహనదారులకు సూచించారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్సులు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనదారులకు జరిమానాలు విధించారు. అలాగే ఆయా వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహన నిబంధనలు రూపొందించడం జరిగిందన్నారు. దీనిని ప్రతి ఒక్క వాహనదారుడు పాటించాల్సిందే అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్‌కు వాహనాలు ఇవ్వడం ఇవన్నీ నేరాలే అన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారికి జరిమానాలతో పాటు చట్టపరమైన శిక్షలు కూడా ఉన్నాయని సీఐ తెలిపారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలంటే నిబంధనలు పాటించాలని సూచించారు. ఒకరి అజాగ్రత్త అతని కుటుంబంతో పాటు, ప్రమాదాల పాలైన వారి కుటుంబాలను కూడా చిన్నాభిన్నం చేస్తుందని, కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ వాహన తనిఖీల్లో ఎస్సై జి.జ్యోతిబాస్, ట్రాఫిక్ ఎస్సై జె.రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

యాదవ సంఘం జిల్లా అధ్యక్షునికి సత్కారం


చింతయ్యను సత్కరిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

దెందులూరు: యాదవ సంఘం నూతన జిల్లా అధ్యక్షుడు ముమ్మడి చింతయ్యను మంగళవారం దెందులూరు మాజీ వైస్ ఎంపీపీ నాగనబోయిన సత్తిబాబు, చల్లచింతలపూడి మాజీ సర్పంచ్ ముమ్మడి మోహనరావు సత్కరించారు. దెందులూరు మండలం చల్లచింతలపూడి గ్రామానికి చెందిన చింతయ్య జిల్లా అధ్యక్షునిగా మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దెందులూరు మండలానికి చెందిన యాదవ సంఘ నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, పెనుబోయిన మహేష్ యాదవ్, నున్నా లక్ష్మణ్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు చింతయ్యను చల్లచింతలపూడి గ్రామంలో శాలువా, పూలదండలతో సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు.

సీహెచ్‌సీలో ఓఆర్ఎస్ సెంటర్ ప్రారంభం


సీహెచ్‌సీలో ఓఆర్ఎస్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు: ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని, వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు సీహెచ్‌సీలో ఆయన ఓఆర్ఎస్ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించడం ద్వారా డయేరియా, ఇతర అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), సీహెచ్‌సీ మాజీ చైర్మన్ కలపాల చంద్రశేఖర్ (బుజ్జి), వీరమాచినేని ప్రభాకర్, క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం


దెందులూరులో పతాకాన్ని ఎగురవేసిన రమణయ్య

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవాన్ని దెందులూరు మండలంలో సాల్వేషన్ ఆర్మీ చర్చిల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దెందులూరులో కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య, కొవ్వలిలో కోర్ ఆఫీసర్ మేజర్ సుబ్బారావు సాల్వేషన్ ఆర్మీ పతాకాలను ఎగురవేశారు. వృద్ధులకు దుస్తులు, రగ్గులు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రిటైర్డ్ జనరల్‌కు సత్కారం

సాల్వేషన్ ఆర్మీ రిటైర్డ్ జనరల్ బ్రియాన్ తెడ్లీని దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చి స్థలదాత పల్లె యోహాన్ కుమారుడు, హ్యూమన్ రైట్స్ కమిషన్ డైరెక్టర్ పల్లె హర్షవర్ధన్ మంగళవారం జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో సత్కరించారు. దెందులూరు గౌడవీధిలో సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణానికి తన తండ్రి స్థలం దానం చేశారని, చర్చి నిర్మాణ ప్రగతిని తెడ్లీకి హర్షవర్ధన్ వివరించారు.


బ్రియాన్ తెడ్లీను సత్కరించిన హర్షవర్ధన్

గ్రంథాలయ భవన నిర్మాణానికి సహకరించండి


కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణానికి సహకరించాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి‌ని కోరారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెట్రిసెల్విని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర బాబు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్ తదితరులు మంగళవారం ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్కను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1980వ సంవత్సరంలో నిర్మించిన జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం పూర్తిగా శిథిలదశకు చేరిందన్నారు. నూతన భవన నిర్మాణానికి, గ్రంథాలయాన్ని తాత్కాలికంగా మరో చోటకి మార్చాల్సిన అవసరం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఉన్న ఇతర సమస్యలను కూడా అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

స్థానికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో మంగళవారం స్థానికులు అప్రమత్తతో పెద్ద ప్రమాదం తప్పింది. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులోని షాపునకు సంబంధించిన ఫ్లెక్సీ విరిగిపోయి 11 కేవీ వైర్లపై పడింది. దీంతో భారీగా మంటలు వచ్చి 11 కేవీ వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. దీంతో చుట్టుపక్కల షాపుల యజమానులు అప్రమత్తమై ఆ రోడ్డుగుండా వాహనాలు వెళ్లకుండా మోటార్‌సైకిళ్లను అడ్డుగా పెట్టారు. ఘటన సమాచారాన్ని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేశారు. వారు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రధాన రహదారి కావడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ ప్రాంతం ఘటన జరిగిన సమయంలో జనసంచారం లేకపోవడం, వెంటనే స్థానికులు అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పలువురు చెప్పారు.

శ్రేణులకు అండగా వైఎస్సార్ సీపీ


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాద్

దెందులూరు: గెలుపు ఓటములు రాజకీయాల్లో సహజమని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడ వద్దని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నేత ప్రసాద్ సూచించారు. సత్యవోలులో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ గ్రామ కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మాట్లాడారు. పార్టీకి నాయకులు, కార్యకర్తలు చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పార్టీపరంగా ఎటువంటి సమస్యలు వచ్చినా తమను నేరుగా సంప్రదించాలని సూచించారు. అన్నివిభాగాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పనిభద్రత కల్పించాలి

జంగారెడ్డిగూడెం: హమాలీలకు పనిభద్రతతో ఉన్న సమగ్ర చట్టం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. స్థానిక గవర్నమెంట్ టింబర్ డిపో వద్ద మంగళవారం జరిగిన హమాలీల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హమాలీలకు సమగ్ర చట్టం చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలు నిలబెట్టుకోవాలన్నారు. పనిభద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ పింఛన్ తదితర సౌకర్యాలతో చట్టం చేయాలని, హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.